క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: గాంధీనగర్ 11 కేవీ, వినాయక నగర్ వుడా కాలనీ 11కేవీ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయకనగర్ ఫీడర్ పరిధిలోని వుడా కాలనీ, గొంతినవానిపాలెం, వెంకటేశ్వరస్వామి టెంపుల్ వెనకతో పాటు గాంధీనగర్ ఫీడర్ పరిధిలోని సమతా నగర్, చిన నడుపూరు, పెద నడుపూరు, వెంపల్లనగర్, శీకువానిపాలెం తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఆర్‌డీవో నేతృత్వంలో స్పందన

అక్కిరెడ్డిపాలెం: గాజువాక రెవెన్యూ కార్యాలయంలో గురువారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గాజువాక తహసీల్దార్ పాల్ కిరణ్ బుధవారం తెలిపారు. ఆర్‌డీవో పాల్గొని గాజువాక పరిధిలో రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రెవెన్యూ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్న బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెస్ బాక్సింగ్ క్రీడాకారిణికి సాయం



దుర్గా స్ఫూర్తిశ్రీకి ఆర్థిక సాయం అందిస్తున్న కరణంరెడ్డి తదితరులు

గాజువాక: కోల్‌కతాలో జులై 4 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న ఏషియన్ చెస్ బాక్సింగ్ పోటీలకు గాజువాకకు చెందిన క్రీడాకారిణి సత్తి దుర్గా స్ఫూర్తిశ్రీ ఎంపికైంది. ఈ సందర్భంగా బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆమెను అభినందించారు. పోటీలకు హాజరయ్యేందుకు ప్రయాణ ఖర్చుల నిమిత్తం కేఎన్నార్ ఫౌండేషన్ ద్వారా రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ద్వారపురెడ్డి సురేష్‌రెడ్డి, సత్తి సత్యనారాయణ రెడ్డి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఆస్పత్రి స్లాట్ విధానంలో మార్పులు

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రిలో ప్రస్తుతం ఉన్న స్లాట్ విధానంలో మార్పులు చేశారు. ఆస్పత్రి వైద్యులు, స్పెషలిస్టుల వద్దకు వెళ్లడానికి ఇప్పటి వరకు స్లాట్ విధానం ఉంది. స్లాట్ దొరకని రోగులు వెనక్కి తిరిగి వెళ్లాల్సి వస్తుంది. ఈ అంశంపై ఇటీవల ఐఎన్‌టీయూసీ నాయకులు ఆస్పత్రి యాజమాన్యానికి వివరించి స్లాట్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన యాజమాన్యం ఆస్పత్రి స్పెషలిస్టులు, వైద్యులు తమ స్లాట్ పూర్తయిన తర్వాత అక్కడ వేచి ఉండే రోగులను పరీక్షించనున్నారు. ఈ మేరకు ఆస్పత్రి యాజమాన్యం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఆలయాల పునః ప్రతిష్టకు వేళాయె

- తుది దశకు కుంచాలమ్మ, దుర్గాలమ్మ, ముత్యాలమ్మ ఆలయాల పనులు
- ఈ నెల 29 నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు



రూపుదిద్దుకుంటున్న కుంచాలమ్మవారి ఆలయం



దుర్గాలమ్మ అమ్మవారి ఆలయం



ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాం గ్రామంలో జీర్ణోద్ధరణకు గురైన ముగ్గురు అమ్మవార్ల ఆలయాలు కొత్తగా ముస్తాబై పునః ప్రతిష్టకు సిద్ధమయ్యాయి. కుంచమాంబ, దుర్గమాంబ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాలను తొలగించి అదే స్థానంలో రూ.3 కోట్ల వ్యయంతో చేపట్టిన ఆలయాల నిర్మాణాలు చివరి ఘట్టానికి చేరుకున్నాయి. ఈ నెల 29, 30, 31వ తేదీల్లో ముగ్గురమ్మవార్ల ఆలయాల పునఃస్థిర ప్రతిష్టా మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయాల నిర్మాణాలకు 2023 ఫిబ్రవరి 1న శంకుస్థాపన నిర్వహించి, 90 రోజుల్లో పూర్తి చేయడం ఆనందించతగ్గవిషయమని వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి తెలిపారు. నిర్మాణ పనుల్లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రమ దానం చేయడం, దాతలు భారీగా విరాళాలు అందజేయడంతో నిర్విఘ్నంగా పనులు చేపట్టామన్నారు. ఈ నెల 27 నుంచి అమ్మవార్ల మాలధారణ భక్తులతో ఆలయాల వద్ద విశేష పూజలు, హోమాలు నిర్వహిస్తామని తుంగ్లాం గ్రామ అభివృద్ధి సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. 31వ తేదీన శ్రీలలితా పీఠాధిపతులు పరమహంస పరివ్రాజకాచార్య జగద్గురు శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి చేతుల మీదుగా అమ్మవార్ల ఆలయాలను ప్రారంభించనున్నారు. అదే రోజు శ్రీ శక్తి పీఠాధీశ్వరి మంత్రమహేశ్వరి మాతాజీ శ్రీరమ్యానంద భారతి స్వామి వేడుకల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. 29న శ్రీశృంగేరి శారదా పీఠం ఆస్థాన పౌరాణికులు, ప్రవచన నిధి డాక్టర్ శ్రీబాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రితో దేవీ వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనాలు ఉంటాయన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రగతికి సహకరించండి



స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేకు వినతిపత్రం అందిస్తున్న ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రగతికి తమ వంతు సహకారం అందించాలని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్(పర్సనల్) ఎస్.సి.పాండే కోరారు. బుధవారం హెచ్‌ఆర్‌డీ సెంటర్‌లో జరిగిన ఐఎన్‌టీయూసీ మిత్ర పక్షాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేసి, మరింత ఉత్పత్తి సాధనకు కృషి చేయాలన్నారు. ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ కార్మికులకు వేతన సవరణ చేయాలని, మెడికల్ సౌకర్యాలు మెరుగుపర్చాలని, ఇన్సెంటివ్ పెంచాలని, కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. గతంలో ఉన్న కార్మిక సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ సీజీఎంలు కె.శ్రీనివాసరావు, జి.గాంధీ, జీఎంలు కె.సంజీవరావు, బినయ్ ప్రసాద్, నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, వై.మస్తానప్ప, బొడ్డు పైడిరాజు, ఎస్.ఎ.నాయుడు, గోపాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికుడి ఇంట్లో చోరీ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడి ఇంట్లో చోరీ జరిగింది. రాత్రి డాబాపై నిద్రించి తెల్లవారి కిందికి దిగి చూసేసరికి తలుపులు తెరిచి ఉండడంతో దొంగతనం జరిగిందని గ్రహించిన బాధితుడు దువ్వాడ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. వివరాలిలా ఉన్నాయి. అగనంపూడి దరి డొంకాడ కాలనీకి చెందిన పల్లా నానాజీరావు విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తూ కుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంటి డాబాపై నిద్రించేందుకు వెళ్లి తిరిగి బుధవారం ఉదయం కిందికి వచ్చే చూసేసరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా పరుపు తల దగ్గర ఉన్న బాక్సులో ఉండాల్సిన 2.50 తులాల బంగారం పుస్తెలతాడు, 20 తులాలు వెండి వస్తువులు కనిపించలేదు. వెంటనే దువ్వాడ క్రైమ్ పోలీసులకు నానాజీరావు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్ ఢీకొని కారు బోల్తా



శ్రీనగర్ సమీపంలో లోయలో పడిన కారు

కూర్మన్నపాలెం: గాజువాక నుంచి కూర్మన్నపాలెం వైపు బుధవారం వస్తున్న ఓ కారు శ్రీనగర్ బ్రిడ్జికి సమీపంలో డివైడర్‌ను ఢీకొని పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. కారులో ఉన్న భర్త, భార్య, పిల్లలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారంతా కారు దిగి సమీపంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వెళ్లిపోయారు. వారి పూర్తి వివరాలు తెలియలేదు.

‘సహారా’ ఖాతాదారులు, ఉద్యోగులను ఆదుకోవాలి

అగనంపూడి: సహారా ఇండియా ఖాతాదారులు, ఉద్యోగులను ఆదుకోవాలని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు అగనంపూడికి చెందిన సహారా చీఫ్ ఫీల్డ్ మేనేజర్ కిడిమి హనుమంతురావు కోరారు. ఈ మేరకు ఎంపీని కలిసి వినతి పత్రం అందజేశారు. సహారా ఇండియా సంస్థ నిబంధనల ప్రకారం లావాదేవీలు సాగిస్తున్నా పదేళ్ల క్రితం సంస్థకు చెందిన ఆస్తులను సీజ్ చేయడం వల్ల రూ.25వేల కోట్ల మేరకు చెల్లింపు నిలిచిపోవడంతో ఖాతాదారుల్లో ఆందోళన నెలకొందని, అలాగే సంస్థలో పెట్టుబడులు పెట్టిన పది కోట్ల మంది ఖాతాదారుల జీవితాలు ముడిపడి ఉన్నాయన్నారు. అలాగే 12 లక్షల మంది ఉద్యోగులు తీవ్ర ఒత్తిళ్లకు గురువుతున్నారని, కేంద్ర ప్రభుత్వ పెద్దలతో చర్చించి సమస్యను పరిష్కరించి ఖాతాదారులు, ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని హనుమంతురావు కోరారు. వివిధ సంఘాల నాయకులు టి.రాము, బి.సత్యనారాయణ, ఎస్.అచ్చిబాబు, ఎం.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వేసవి విజ్ఞాన శిబిరాలు



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు



డ్యాన్స్ నేర్చుకొంటున్న చిన్నారులు

పెదగంట్యాడ: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో చిన్నారులతో శనివారం గ్రంథ పఠనం చేయించారు. అలాగే కథలు చెప్పారు. అనంతరం ఖోఖో పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

డ్యాన్స్, చెస్‌లలో శిక్షణ

గాజువాక: గాజువాక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా చిన్నారులకు బుధవారం డ్యాన్స్, చెస్‌లో శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి బి.చంద్రకళ, ఐద్వా అధ్యక్షురాలు కె.సంతోషం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం తెలుగు పదాలు పలకడం, రాయడంపై తర్ఫీదు ఇచ్చారు. చిన్నారులకు చాక్లెట్లను, బిస్కెట్లను బహుమతులుగా అందజేశారు.

అమ్మోనియా లీకేజీ కట్టడిపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కర్మాగార శాఖ, ఎన్‌డీఆర్‌ఎఫ్ ,కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో ఆఫ్ సైట్ మాక్ డ్రిల్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ పరిశ్రమల నుంచి అమ్మోనియా లీక్ అయితే ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలి.. లీకేజీను ఎలా నియంత్రించాలన్న దానిపై అవగాహన సదస్సు ద్వారా జిల్లా డిప్యూటీ కలెక్టర్ (స్పెషల్), కర్మాగారాల జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ రెడ్డి వివరించారు. సీఐ సురేష్‌బాబు, కర్మాగారాల ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ములగాడ మండల తహసీల్దార్ డి.వీరభద్రరావు, కోరమాండల్ వైస్ ప్రెసిడెంట్ సుందరం ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, కోరమాండల్ అధికారులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో చిన్నారుల ప్రతిభ



బాక్సింగ్‌లో పతకాలు సాధించిన మైక్ టైసన్ బాక్సింగ్ సొసైటీ చిన్నారులు

మల్కాపురం: ఇటీవల నగరంలోని స్వర్ణభారతి స్టేడియంలో వివిధ కేటగిరీల్లో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన మైక్ టైసన్ బాక్సిగ్ సొసైటీ క్లబ్ క్రీడాకారులు ప్రతిభ చూపారు. వాసుదేవ్ బంగారు పతకం సాధించగా హర్షిత బ్రాంజ్, కల్పిత సిల్వర్ మెడల్స్ సాధించారు. క్లబ్ నిర్వాహకులు బుధవారం శ్రీహరిపురం మైదానం వద్ద పతకాలు సాధించిన చిన్నారులతో పాటు కోచ్‌ను అభినందించారు.

వికసించిన బ్రహ్మ కమలాలు



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్-5లోని 304ఏ క్వార్టర్‌లో అరుదైన బ్రహ్మ కమలాలు పూశాయి. స్టీల్‌ప్లాంట్ ఎల్‌పీఎఫ్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎం .ఆనందబాబు దంపతులు కొన్నాళ్ల క్రితం బ్రహ్మ కమలం మొక్కను నాటారు. ఆ మొక్క నుంచి బుధవారం రాత్రి మూడు పుష్పాలు పూశాయి. ఈ విషయం తెలియడంతో చుట్టు పక్కల నివాసితులు వాటిని ఆసక్తిగా తిలకించారు.

చెత్త తొలగించి.. తరలించారు..



వుడా ఫేస్-7లోని గెడ్డలో పొక్లెయిన్‌తో పూడిక తీస్తున్న జీవీఎంసీ సిబ్బంది



రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు సిద్ధార్థనగర్ శ్మశానవాటిక పక్కన పేరుకుపోయిన చెత్త, డెబ్రిస్, ప్లాస్టిక్ వ్యర్థాలను జీవీఎంసీ అధికారులు పొక్లెయిన్‌తో శుభ్రం చేయించి చెత్తను అక్కడ నుంచి తరలించారు. అలాగే 86వ వార్డు వుడా ఫేస్-7లోని గెడ్డను సైతం పొక్లెయిన్‌తో శుభ్రం చేసి పూడిక తీయించారు. కొద్ది రోజులుగా సిద్ధార్థనగర్, ఫకీర్‌టకియా తదితర ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలు పేరుకుపోయాయి. ఈ సమస్యపై ఈ నెల 23న ‘చెత్త’శుద్ధి కరువాయె శీర్షకన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. బుధవారం పారిశుధ్య సిబ్బందితో చెత్తను శుభ్రం చేయించి డంపింగ్‌యార్డ్‌కు తరలించారు. రోజులు తరబడి ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ‘సాక్షి’కి కృతజ్ఞతలు తెలిపారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం



స్వచ్ఛ సర్వేక్షణ్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు

పెదగంట్యాడ: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖను నంబర్ వన్‌గా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు కోరారు. జీవీఎంసీ 65వ వార్డు వికాస్‌నగర్‌లో జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహపాత్రుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శుభ్రత పాటిస్తే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. ఇళ్లలోని చెత్తను రోడ్లపై, కాలువల్లో వేయవద్దని, ప్రతి రోజూ ఇంటి వద్దకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. అనంతరం తడి-పొడి చెత్త డబ్బాలను పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్, ఫణి, జన, సతీష్, రామకృష్ణ, సోనీ, తదితరులు పాల్గొన్నారు.

థైరాయిడ్‌పై అప్రమత్తత అవసరం



డాక్టర్ శ్రావణి తాన్న

అక్కిరెడ్డిపాలెం: ఇటీవల కాలంలో అనేక మంది మహిళలను వేధిస్తున్న థైరాయిడ్ సమస్యపై అప్రమత్తంగా ఉండాలని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ ఎండో క్రైనాలజిస్ట్ డాక్టర్ శ్రావణి తాన్న సూచించారు. ఈనెల 25న అంతర్జాతీయ థైరాయిడ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలు ఎదుర్కొంటున్న ఈ సమస్యపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతాకోక చిలుక ఆకారంలో మెడ భాగంలో ఉండే గ్రంధి పేరే థైరాయిడ్ గ్రంధి అన్నారు. ఈ గ్రంధి నుంచి థైరాయిడ్ హార్మోన్ విడుదలవుతుందన్నారు. ఇది శరీరంలో అన్ని జీవ క్రియలను సమతుల్యంగా ఉంచడానికి అవసరం అన్నారు. గర్భిణీల్లో హైపో థైరాయిడజం వల్ల అబార్షన్, రక్తపోటు ఎక్కువగా ఉండటం, రక్తహీనతకు గురికావడం జరగవచ్చునని చెప్పారు. థైరాయిడ్ బాధితులు తప్పనిసరిగా వైద్యుల సూచనల మేరకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుని, యాంటీ థైరాయిడ్ మందులు వాడాలని తెలిపారు.

ఉక్కు ఉద్యమం మార్గదర్శకం కావాలి



832వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో సాధించుకున్న పరిశ్రమను చేజార్చుకోమని, కార్మికులు చేస్తున్న ఉక్కు ఉద్యమం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకం కావాలని ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు బోండా తాడన్న అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 832వ ఉక్కు రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పలకొండ, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్‌లు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణలు, కార్యదర్శి బయ్యే మల్లయ్య, ఎల్.వి.రమణ, ఎస్.సత్యనారాయణ, కె.వి.రత్నం, గణేష్, పైడి కొండలరావు, ఫణీంద్రబాబు, వేణుగోపాలరావు, మోహన్‌బాబు, పుల్లారావు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

27న పెయింటింగ్ పోటీలు

సీతంపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల సెమినార్ హాల్లో పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఇండియా యూత్ ఫర్ సొసైటీ ప్రతినిధి అప్పలరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ‘బీచ్ ప్లాస్టిక్ పొల్యూషన్’ అనే అంశంపై శనివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల వారు 81214 81452 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

గొందేశివానిపాలెంలో ఉద్రిక్తత

- తమ స్థలంలో ఇల్లుకట్టనివ్వడం లేదని ఆరోపణ
- టెన్షన్‌తో కృష్ణ మృతిచెందాడని కుటుంబ సభ్యుల ఆందోళన
- చక్కదిద్దిన గాజువాక పోలీసులు



మృతుడు కొన్న స్థలంలో దహనం చేసేందుకు పేర్చిన కట్టెలు, మృతుడు కృష్ణ (ఫైల్)



ఇంటి నిర్మాణానికి అడ్డుతగులుతున్న వ్యక్తి ఇంటి ముందు గుమిగూడిన మృతుడి బంధువులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గొందేశివానిపాలెంలో బుధవారం ఉదయం ఉద్రిక్తత పరిస్థితి నెలకుంది. ఇక్కడ నివాసం ఉంటున్న చంద్రరావు అనే వ్యక్తి ఇంటికి పదుల సంఖ్యలో జనం చేరడంతో అలజడి రేగింది. దీనిపై స్థానికులు, పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 59వ వార్డు హనుమాన్‌నగర్ ప్రాంతంలో సాదుబిల్లి కృష్ణ (42) భార్య లీలా,పదో తరగతి చదువుతున్న కుమారుడు,తొమ్మిది చదువుతున్న కుమార్తెలతో కలిసి కొంత కాలం నుంచి నివాసం ఉంటున్నాడు. కృష్ణ భవన నిర్మాణ కార్మికుడిగా,గ్యాస్ డెలివరీ బాయ్‌గా కూడా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే పదేళ్ల కిందట 58వ వార్డు గొందేశివానిపాలెంలో చంద్రరావు సోదరుడి వద్ద కొంత స్థలాన్ని కృష్ణ కొనుగోలు చేశాడు. ఆ స్థలంలో ఇల్లు నిర్మించుకోవడానికి పనులు చేసేందుకు సిద్ధపడగా చంద్రరావు అడ్డుకున్నాడు. అన్నదమ్ముల ఆస్తి పంపకంలో తేడా ఉందని, ఈ స్థలంలో ఇంటిని నిర్మిస్తే ఉరుకోమని గొడవకు దిగారు. దీంతో కృష్ణ గొడవపై అప్పుడే గాజువాక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మరలా కొద్ది రోజుల కిందట తన స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు వెళ్తే మరలా చంద్రరావు వాదనకు దిగాడు. దీంతో మనస్తాపం చెందిన కృష్ణకు మంగళవారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి ఊపిరి ఆడక చనిపోయాడు. దీంతో కృష్ణ మృతికి చంద్రరావు కారణమంటూ అతగి బంధువులు బుధవారం చంద్రరావు ఇంటికి చేరుకున్నారు. చంద్రరావును అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు చేసిన స్థలంలోనే దహనం చేయడానికి కట్టెలు పేర్చారు. రంగంలోకి దిగిన గాజువాక సీఐ భాస్కరరావు తన సిబ్బంది సాయంతో అక్కడ గుమిగూడిన వారిని చెదరగొట్టారు. విచారణ నిమిత్తం చంద్రరావును గాజువాక స్టేషన్‌కు తీసుకువెళ్లారు.దీంతో పరిస్థితి సద్దుమణిగింది.

స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

మద్రిపాలెం: ఈ నెల 27 నుంచి జూన్ 3 వరకు మాధవధారలోని ఎంఎస్‌ఆర్ గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు మాధవనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు చదువుకున్న విద్యార్థులకు ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు మెంటర్ హెచ్.వి.రమణ ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఉంటుందన్నారు.ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 26 లోపు ఎంఎస్‌ఆర్ గ్రంథాలయంలో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

28న ‘ఘంటసాల జీవిత చరిత్ర’ నాటకం

డాబాగార్డెన్స్: దేశ నాటక రంగ చరిత్రలో తొలి నాటక గ్రంథాలయానికి శాశ్వత నిధుల కోసం రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28న ఘంటసాల జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించనున్నట్టు సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు బాదంగీర్ సాయి తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. కళాభారతి ఆడిటోరియం వేదికగా సాయంత్రం 5 గంటలకు, రాత్రి 7.30 గంటలకు వరుసగా రెండు ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. వివరాలకు 94404 58458 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.